# ముల్లా కథలు

రచన:
పొట్లపల్లి రామారావు

ఒకరోజు ముల్లా వీధిగుండ పోతుఉంటే ఎవడో అపరిచితు డొకడు ముల్లాను ఈడ్చి ముఖంపై వేసి "క్షమించండి... మిమ్మల్ని చూడటములో పొరపడ్డాను" అని కాళ్లు వేళ్లు పట్టుకోదొడగాడు. ముల్లా వినక ఖాజీగారికి ఈడ్చుకపోయాడు వాణ్ణి. ఖాజి ముల్లా ఫిర్యాదు విని దెబ్బకు బదులు దెబ్బ వేయమని తీర్పు చెప్పాడు. కాని ముల్లా ఒప్పుకోలేదు. యిప్పుడు మీ తీర్పును ఆధారం చేసుకొని చెంపదెబ్బ వేయడంలో సారస్య మేముందండి. వేస్తె ఆ ఉడుకుమీదనే వేయవలసిఉండే" అని ముల్లా జవాబు చెప్పాడు.

అయితే మానవష్టానికిగాను ముల్లాకు ఓ కాసు యివ్వవలసిందని వాడికి ఆజ్ఞ యిచ్చాడు ఖాజీ. ఆ అపరిచిత వ్యక్తి కాసు తేవటానికిగాను యింటికి పోతానన్నాడు.

"వీడు యింటికిపోతే మళ్లి రాడు" అన్నాడు ముల్లా.

"ఎందుకు ఆతురత పడుతావు నేనున్నానుగా" అన్నాడు ఖాజీ.

"అయితే మీ యిష్టము" అన్నాడు ముల్లా.

కాసు తేవడానికి పోయిన ఆ వ్యక్తి ఎంతకూ రాక పోయాడు.

"ఏమండి! ఎప్పుడు వస్తాడు వీడు" అని ముల్లా వేగిరపడ దొడగాడు.

"వస్తాడు...కొంచెం ఓపిక" అనటం ఆరంభించాడు ఖాజీ.

ముల్లా యిక ఆగలేక లేచి ఖాజీ చెంపపైన ఈడ్చి కొట్టి "మీకు ఎట్లాగూ వాడు కాసు తెస్తాడని నమ్మకం ఉందికదా? వాడు కాసు తెచ్చిన వెనుక చెంప దెబ్బకు బదులు మీరు తీసుకోండి" అని వెళ్ళిపోయాడు.

ఖాజి పాపం! దిక్కు మొగ మేసాడు.

## మృత్యువు భయం ♦

ముల్లా ఒకరోజు ఊరిబయట తిరుగుతున్నాడు. అకస్మాత్తుగా అతనివంట్లో, ఎటో, ఎటో, కాదొడగింది. ముల్లా యిక తాను బ్రతకననుకొని, తూర్పు దిక్కు ముఖంచేసి అక్కడే పడిపోయాడు. చాల సేపటివరకు ఆ దారిన ఎవరు రాలేదు.

ముల్లాకు తొందరగపుట్టి యింటికి లేచిపోయి "నేను ఎంతో సేపటినుండి ఊరిబయట చచ్చి పడి ఉన్నాను. నన్ను పార వేయడమో, పూడ్చివేయడమో, అలోచించినవాడే లేడు" అని భార్యతో చెప్పి మళ్ళి వచ్చిన చోటికి మళ్ళి పోయాడు.

భార్య ఓ వెర్రిబాగులది. ముల్లా మాటలు విని ఏడ్పు ఆరంభించింది. ఊరివాళ్లంత ఏడ్పు విని ముల్లా యింట్లో గుమిగూడారు. వాళ్లందరు ముల్లా చని చనిపోయినందుకు చాల చింతించారు. చాలసేపటికి వాళ్ళలో ఒకడు "ఈవార్త ఎవరు తెచ్చారమ్మా"? అని ముల్లా భార్యను అడిగాడు.

"పాపము ముల్లా దగ్గర ఎవరున్నారు వార్త తేవడానికి. పాపము ఆయనే కాళ్లు ఈడ్చుకుంటు వచ్చి చెప్పిపోయాడు" అంది.

విన్నవాళ్లంత గొల్లున నవ్వారు.

ముల్లా వనన్ని ఏడ్పించటానికి చేసిన ఎత్తురా" అని ఎక్కడివాళ్లు అక్కడ వెళ్ళిపోయారు.

## మబ్బు నీడ ♦

ముల్లా ఒకరోజు మైదానములో భూమిత్రవ్వుతు దేనినో వెతుకుతున్నాడు. దారిన పోతున్నవాడొకడు. "ఏమి వెతుకుతున్నావు"? అన్నాడు.

"డబ్బు దాచాను. అది దొరకడము లేదు" అన్నాడు.

"అప్పుడేదైన గుర్తు పెట్టుకోలేదా? అన్నాడు బాటసారి.

"గుర్తు ఎందుకులేదు. అప్పుడు నా నెత్తిమీద మబ్బు ఉంది"

"కాని మబ్బు ఎప్పుడు ఒక్కదిక్కు ఉంటుందా"?

"మబ్బు జరిగిపోతే డబ్బు జరిగిపోతుందా"?

"డబ్బు జరిగిపోదు కాని ఫలానా దిక్కు ఉన్నదని ఎట్లా తెలియాలె"?

"అరే! బుద్ధిహీనుడా? కొంచెం పైకి చూడు. మబ్బు ఉందా—లేదా? అదే గుర్తు. వెర్రిగా త్రవ్వుతున్నాననుకున్నావా" అని ముల్లా హుంకరించాడు. ముల్లా అవివేకానికి నవ్వుతు బాటసారి వెళ్ళిపోయాడు.